# తీర్మానం

## చదలవాడ సుందరరామయ్య



ఇంటిముందు వంచలో మంచిగానికి ఒక ప్రక్కగా చతికిలబడి తాడు పేనుతున్నాడు వెంకటేశు. గొట్టం పాంటు, స్లాకు వేసుకుని కొంచెం నాగరికంగా కన్పడుతున్న సంజీవరావు తండ్రి కెదురుగా ముక్కాలిపీట మీద కూర్చుని ఏదో నచ్చచెప్పడానికి ప్రయత్నిస్తున్నాడు.

వాళ్ళిద్దరి మధ్య అప్పుడొక మాట, అప్పుడొక మాట అందుకుంటూ వెంకటేశు భార్య మాలచ్మి గడపకు లోపలగా కూర్చుని వుంది.

"అది గాదయ్యా! నేను చెప్పేమాట కొంచెం వినిపించుకో మీ యిదరికి వయసు మళ్ళిపోయింది. వచ్చే పొద్దు, పోయే పొద్దాయె అద్దద్ద అంటే నేను రావాలన్నా ఒక రోజు సరిపోదాయె మీరిద్దరు కూడా అక్కడికే వచ్చి మాతో పాటు కలో, గంజో తాగితే సరిపోయె. మీ కోడలు, నేను ప్రొద్దున బొక్కెడు మెతుకులు దిని ఉద్యోగాలకి పోతే మళ్ళా పొద్దు గర్భంలోపడె యాళకి చేరుకుంటాము. ఇల్లు కనిపెట్టుకుని మీరుండొచ్చు. ఈ దిక్కుమాలిన పల్లెటూళ్ళో ఏం బావుకుందామని. వానొస్తే రోడ్లనీన్ని మోకాళ్ళ లోతు బురద. బస్సు సౌకర్యం చూద్దామా ఎక్కడో మూడు మైళ్ళవతల దిగి నడిచి రావాలి రోగం రొప్పు వస్తే ఒక డాక్టరా; వైద్యమా, పాడా ఏముంది?"

"ఒరేయ్ సంజిగా! నేను గోచి పెట్టిన కాడినుంచి ఈ ఊళ్ళో వుంటన్నాను. ఎప్పుడన్నా మరియమ్మ తిరణాలకని పక్కూరికి తప్ప పొలిమేర దాటెరగను. ఏడకన్నా బోతే నాకు పెర్లో సేపను ఒడ్డు నేసినట్టుగా వుంటాది. కాత్తో కూత్తో సదుగు ఎలగబెట్టి ఉద్దోగమంటూ ఊళ్లేలతన్నావుగాని నువు మాత్రం ఈడ బుట్టలేదా, పెరగలేదా? ఏదో కొద్దో, గొప్పో బగమంతుడిచ్చిన మడి సెక్కుందిగా. దాని మంచి, సెబ్బరా సూసుకుంటూ అందులో పండిన గింజలు రాల్చుకుని మీ యమ్మ, నేను కాలం ఎల్లబుచ్చుతాము. నువు మాకేం పెట్టక్కర్లేదు పొయ్యక్కర్లేదు నీ పెళ్ళాం, పిల్లలు, సంసారం, నీ తిప్పలెయ్యో నువు బడు, మా జోలి నీకెందుకంటా?"

"ఈ మడిపికి కాస్త నువ్వన్నా సెప్పవేమే అమ్మా? అట్లా గుడ్లు బెట్టుకు సూస్తావు" సంజీవరావు విసుక్కున్నాడు తల్లిమీద.

"మీ అయ్య సంగతి నీకు తెలవందేముందిరా! మొండిమడిపి. నేనేదన్నా సెప్పబోతే బడితుచ్చుకుంటాడు. నాకేమిటి కొచ్చిన తిప్పలు," అంటూ చేతులు తిప్పుకుంటూ, మూతి విరుచుకుంటూ మాట్లాడింది మాలచ్మి.

"అయ్యా! ఈ వయసులో నువు రెక్కలు ముక్కలు జేసుకుని పొలంసుట్టూ తిరగకపోతే ఏందంటా? వండుతున్నయ్యా. సస్తన్నయ్యా? తీరా నోటికాడి కొచ్చేసరికి గాలివానలని, తెగుళ్ళని ఏదో ఒక మిత్తవ వచ్చి పడుతుందె. ఎందుకు సెప్పు నీకీ శాకిరీ? మన కాడి గట్టునున్న పెదగాడు కొంటానికి సిద్ధంగా వున్నాడు మంచి రేటుగూడ వస్తది. నీ కోడలు, నేను కలిపి పైసా పైసా కూడేసి బస్తీలో పది సెంట్లు జాగా కొన్నాము. ఈ పొలం అమ్మిన సొమ్ము బెట్టి అందులో మంచిగా ఒక ఇల్లేసుకున్నామంటే అందరం అక్కడే పడుండవచ్చు. సిన్నోడినని నా మాట తీసెయ్యబోక నువ్వు కూడా యోశన జేసి చూడు" అంటూ తండ్రికి ఆలోచించుకోడానికి వ్యవధానం ఇచ్చినట్లు బైటికి లేచిపోయాడు.

"ఆరి కంత్రీ నాకొడకా! ఏడికేడికి బిత్తరేసినావు? సూసినావంటే కట్టాకారి ముండా. నీ కొడుకెంత పేను మీదుండాడో? లేకపోతే ఈడికి యిన్నాళ్ళనుంచి లేని పేను ఇప్పుడెందుక్కు బుట్టినాదంటా? నువ్వొక బైనీడు ముండవి. కొడుకు తాన అంటె, తందాన అంటవు. ఈనాకొడుకు పొలం అమ్ముకునూకి మనిద్దర్ని తోలుకెళ్ళి కుక్కకేసినట్టు బొక్కెడు మెతుకు లేత్తాకొంట. ఇదుగో సెప్తున్నా. నా బొందిలో పేనముండగా బూదేవి తల్లిని అమ్మడం జరగదుగాక జరగదు. వచ్చిన దోవనే నూక్కెల్లమని సెప్పు నీ కొడుక్కి." అంటూ పెళ్ళాంమీద హూంకరించి పైగుడ్డ దులిపి బుజానేసుకుని బైటికెళ్ళాడు వెంకటేశు.

"ఈల్లిద్దరిమద్దెనా నేను సత్తన్నాగదరా ఏసు పబువా" అంటూ నెత్తి గొట్టుకుంటూ ఇంట్లో కెళ్ళింది మాలచ్మి.

ఆ రోజు సందమాపటేళ పోలయ్య, జకరయ్య నాగేశు, మరి నలుగురు పెద్దలు కలిసి వెంకటేశు ఇంటి ముందు సమావేశమయ్యారు. సంజీవరావు ఇంటిముందున్న చెట్టు బోదె కానుకుని కూర్చున్నాడు. వెంకటేశు చుట్ట ముట్టించుకుంటూ పెద్దల నుద్దేశించి అన్నాడు.

"ఈ దొంగ నా కొడుకు తీరుపుసెయ్యమని మీ యందర్ని పిలుసుకొచ్చినాడా ఏందిరా?"

"నువ్వట్లా కోంపడితే ఎట్లనే మామా? ఆడూ సమాకునోడు. కాత్తో, కూత్తో మన

సాధారణంగా మనిషికి తల్లిదండ్రులమీద కంటే తన పిల్లలమీద యెక్కువ ప్రేమ వుంటుందంటారు భూమిమీద ప్రేమ, కన్నకొడుకును కాదంటే, ఆ అనుబంధం అంతకంటే గొప్పదనే కదా.

కంటె గేనం గల్గినోడు. ఆడు సెప్పిన మాటకూడా మనం కాస్త ఇనుకోవాల గందా? సూడు మామా? నువు మా అందర్లోకి పెద్దోడివి. నీకు సెప్పగల్గినోళ్ళం గాదు మేము. అయినా మా మాట గూడ కూసంత ఇనిపించుకో." అన్నాడు పోలయ్య.

"పల్లే కాసేందిరా. మీరు పల్లెకు పెద్ద మడుసులు. ఏం సేయం సెప్తారో సేనూ సూత్తాగా" అన్నాడు వెంకటేశు.

"ఏదో ఆడొచ్చి మమ్మల్ని పలా కోర మట్టి మేము వచ్చాంగాని. నీకు సెప్ప దగ్గోళ్ళమా బాబాయి. నీకిప్పుడు డెబ్బై ఏళ్ళు పైమాటే గందా. ఊరు బొమ్మంటుంటే కాడు రమ్మంటూంది. ఆడా నీ కొక్కగా నొక్క బొట్టెడు. ఎవరికాళ్ళే యమునాతీరే అన్నట్టుగా ఆడక్కడా మీరిక్కడా ఎందుకు? మొన్నా మద్దెలో గుండెలో నొప్పవి. పాడవి రెండు మూడు మాట్లు గడబిడ సేసినవుగందా? ఏ రోగమొచ్చినా తొప్పొచ్చినా ఆశార్లుగారిచ్చే నల్లమాత్రలు దప్ప మనకి గతిలేపోయె. నీ కొడుకుదగ్గర పేరినవంటే పట్టంలో మంచి మంచి డాట్టరు బాబులుంటరు. ఆళ్ళ దగ్గర నీకు మంచిగ వైద్దెగందొరుకుతాది. నామాటివి ఈ రొస్టంతా నీకేమిటికిగాని ఆడికాడికే సేరు." అన్నాడు జకరయ్యా.

అంతలోకే నాగేశందుకుని "అయినా ఇంతొయెసొచ్చి. సేనని సెట్టనీ పొద్దు గూకులూ తిరుగుతనే వుంటవాయె. ఓపి కుడిగినప్పుడు ఏసుపబువుని తల్సుకుంటూ కాస్త నింపాదిగా బతకగూడదటే? ఇంక ఆ సేలంటావా. తెక్కలు ముక్కలు సేసుకుని ఏటెల్లకాలం శాకిరి సేస్తే తినడానికొచ్చేటప్పటికి ఏదొక మిడిగాలం వచ్చి పడుతుండె. ఆడు సెప్పినట్టినుకుని. ఆ సెక్క కాస్త అమ్మేసి పొయ్యి ఆడిదగ్గరే పడుండు" అన్నాడు.

చుట్ట ఆఖరు దమ్ములాగి అవతలపడేసి వెంకటేశు అన్నాడు.

"మీరు సెప్పేది బాగనె వుందిగానొరే; నేనొక మాటసెప్తా ఇనుకోండి నా కళ్ళ ముందు గోసీలుపెట్టి తిరిగినోళ్ళు మీరు. రైతుకు సొంత సేనుండి. అరక దున్నుకుని. ఇత్తనాలు జల్లుకుని. పంట సేతికి రావడం ఎంత సంబరమో మీ కెరికలేదు. నరుడ్ని నమ్మి సెడినోడుండాడుగాని బూదేవిని నమ్మి సెడినోడు ఈ సెపంచకంలో వోడూ లేదు. మీ యందరికి సెళ్ళా



లుండారు. పిల్లలుండారు. రోజంతా శాకిరిజేసి ఆళ్ళకి మీసు కడుపునిండా గంజి బోత్తన్నారా? పెట్టలేనోళ్ళంగదా కంటం దేనికని పెళ్ళాల దగ్గర తొంగోడం మాను కుంటన్నారా? మీ పెళ్ళాలు ఏడాది కొకడిని కంటం మానుకుంటన్నారా? సేను పేసే రైతుగూడ అంతేరా! ఒకేడో రెండేళ్ళో పెద్దామని. అలుక గట్టకా మానడు. పైరెయ్యకా మానడు. ఎన్ని నట్టాలొచ్చినా. కట్టాలొచ్చినా ఆ తల్లిని కొల్సుకోకమానడు ఆడు సేపేవని ఆడు సెయ్యాల. ఆపైన బగమంతుడి దయ. మీరందరూ నన్ను పొలం అమ్మమంటుంటే. "అరేయ్ వెంకటేశూ! నీ సెయ్యొకదాన్ని నరికియ్యరా" అన్నట్టుగుంది నాకు. ఆడు నా కడుపునబుట్టినోడు. ఆడు నేనుగూడ ఆ పేలో గింజలు దినే బతికాం దానిమీదొచ్చే వరుమానంబెట్టే ఈడు సదుకు ఎలగబెట్టి గౌర్నమెంటు నౌకరీ మిడుకుతున్నాడు ఆ బూమే లేపోతే. మీయందరి మల్లేనే పారం. నలుగు బుజేనేసుకుని బావిలో కప్పనాగ ఈదే బతికేటోడు. ఆ ఇశ్వాసం గూడ లేకండా ఈడియ్యాల పొలం అమ్మదారని తయారయ్యాడు. థూ! ఎందుకురా ఇశ్వాసం లేని జలమ."

"కాదులే మామా! నువు కూసంత నింపాదిపడు. ఈ ముసలితనంలో మా అయ్య కట్టపడ్డం నేనుసూడలేపోతున్నాను. ఆడిని సుగబెట్టే శకితి బగమంతుడు నాకిచ్చినాడుగందా. అందుకని ఆళ్ళిద్దర్ని నాకాడికి తోలుగపోతాను" అంటున్నాడు ఆడు. అందుశాత. మీ ముసలాళ్ళిద్దరూ ఒక నెల దినాలపాటు ఆడికాడకు పొండి. మీకు నసవర్తిగా వుండి మంచిగా వుందనుకుంటే ఆడనే వుండిపొండి. లేదంటే తిరిగి ఈడకే మూక్కురండి." అంటూ సంజీవరావు మద్దేశించి "ఏరా సంజిగా! మీ అయ్యకు. అమ్మకు ఏదన్నాఇబ్బంది గాని జరిగిందంటే ఆళ్ళిడకు తిరిగొత్తారు. నీ పెళ్ళాంమాటిని ఆళ్ళని అట్టా. ఇట్టా తిప్పలు బెట్టినావంటే లాబంలేదు. ఆళ్ళు తిరిగి ఈడ కొచ్చిపినారంటే నువ్వాళ్ళకు నెలకు ఇన్నూరురూపాయలు బరణం బతికినంత కాలం ఇవ్వాల. ఇట్టాగని మా పంచాయితీ దార్లందరిమి తీర్మానం సేపినాము నీకు ముమ్మాటికి ఇట్టమేనా? ప్రశ్నించాడు పోలాయి.

"అట్లనే మామా! ఆళ్ళిద్దర్ని నేను నెత్తి మీద బెట్టి చూసుకుంటా. ఆ మాత్రం జ్ఞానం నాకు లేకపోలా. అయినాగాని. పెళ్ళం బోతే యింకోదాన్ని కట్టుకోవచ్చు. అమ్మ. అయ్య బోతే ఏడనుంచొస్తారు. మీసు జేసిన తీర్మానానికి



ఏదైనా తబిశీలొస్తే నన్ను బిలిపించి చెప్పుచ్చుకు కొట్టండి."అన్నాడు సంజీవరావు.

"ఏరా జక్రయ్యా! ఇన్నారుగా మీరందరూ? రేపు శాస్త్రుల్లగారినడిగి మంచి లగ్గం పెట్టి ముసిలాళ్ళిదరిని ఆడెంట పంపేద్దాం." అంటూ తేల్చేశాడుపోలాయి.

వెంకటేశు కాసేపటిదాకా ఏమి మాట్లాడలేదు. కొంచెంసేపు తనలో తనే మథనపడి అన్నాడు. "అరే పోలయ్యా! మీరందరూ పెద్దలు. మీ తీసుపుకి నేను బద్ధుడినై వుంటా. బూమి అమ్మడానికి నా ఘనసొల్ల కోటల్లా. ఎందుకంటె దానికి సెప్పటానికి పాలా కతుంది. నా సోపగూడ మీ పెద్దమడుసులు కూసంత ఆలకించండి. నాకు గోసి పెట్టుకునే గేనం వచ్చేతలికి ఈ పల్లెలో పట్టుమని పది కొంపలు లేవు ఈ పల్లెకు తొలిగా గడ్డెత్తింది మా కుటుంబీకులే. మీ నల్లూరాళ్ళు సొప్పదాళ్ళు కాకర్ల మూడాళ్ళు తరవాత్తరవాత ఈడికి సేరినారు. మా అయ్య బూసాయి ఈ ఊరికి పెద మాదిగ. ఊళ్ళో టముకేసేవోడు. మాదిగపని చేసేవోడు. కుప్పల టయంలో కామందులందరు తలాక రెండు కట్టలు పంటగడ్డి ఇచ్చేవోళ్ళు. ఆ గింజలు మాకు ఎక్కతొక్క సరిపోయేవి. కాపుసారా తాగి మా అయ్య పిందేస్తా టముకేస్తంటే ఊరు ఊరంతా ఇుగబడి సూసేది అసుంటి రోజులు రమ్మన్నారావు. నాల్గు రూకలిస్తే బస్తా గింజలొచ్చేయి. అర్ధణా డబ్బులెడితే సోలెడు శనగపప్పొచ్చేయి.

ఆ టయాంలో కరనంగారి దగ్గర మా అయ్య పని జేసేటోడు. పెద కరనంగారు సనిపోయినాక ఆయన కొడుకు కరనంగిరీ కొచ్చినాడు. సక్కగా శందురుడులా గుండేవోడు. ఎంత సక్కం గుండేవోడో అంత సల్లని తండ్రి. ఆయన అయాములో పనికి నేను జేరినా. ఆయన పొలానికిబోతే పొలానికి బోయేవోడిని. బయటూరికిబోతే ఎంటే వుండేవోడిని. నన్నిడిసిపెట్టి వుండేవోడుగాదు. కచ్చేరీ సావిడిలో ఆయన శిస్తు వసూలు జేత్తంటే నేనూ ఆడే కూసునేవోడిని రేత్తుర్లు పెళ్ళం బిడ్డలకాడ ఏం వుండేవోడోగాని. దినమంతా కచ్చెరీలోనే వుండేవోడు. ఒకపాలి ఆయనకు బాగా సుస్తీ సేసింది. మన ఆశార్లుగారేవైద్యగం.పత్తెం.పానంఅంతా కచేరీలోనె. కొడుకులొచ్చి పరామరిశజేసి ఎల్తుండేవోళ్ళు. ఆయనకు సుస్తీ సేపినపుడు మాతరం రేత్తుర్లుగూడ ఆయనకాశనే పండుకునేవోడిని. ఒకరోజు రేతిరిపూట ఏమైందంటే. అప్పుడప్పుడే నాకు కునుకుపడతావుంది.

"ఒరేయ్ వెంకటేశూ! ఆ కూజాలోయి కాసిని మంచినీళ్ళందుకోరా" అన్నాడు. నాకంతా అయోమయమైపోయింది ఆయన సూడబోతే నికాల్సయిన బాపనాయిన. నేనా మాదిగోడిని నా సేతినీళ్ళు ఆయనగోరు తాగుతాడా? జొరంగా వుండి పైతెంజేసి

మాట్లాడుతన్నాశా అనుకుని కూసేపు అందాయించినా.

"నీగ్గాదురా సెప్పేది? గొంతెండి పోతంది. కాపిని నీళ్ళివ్వరా అంటే ఏంటి దేబ్బెంలాగ నిలబడ్డావు" అంటూ ఇసుక్కున్నాడు. ఇంగ నాకు దప్పలా. గబగబా బైట పంపుకాడికెల్లి సేతులు శుబ్బరంగా కడుక్కొచ్చి నీళ్ళుబోసి యిచ్చినా. ఇంకా దే. ఇంకా దే అని సరింగా మూడు గలాసుల నీళ్ళు దాగిండు. పావం! ఎంత దాగమయిందో! అదయిపోయిం తరువాత నేనడిగినా "ఏంది సామీ! మాది గోడి సేతినీళ్ళు తాగినవు" అన్నా.

"ఏందిరా అయితే? మాదిగోళ్ళు మదుసులుగారా? మేం దినే బువ్వ మీరు దింటంలేదా. మేం తాగే నీళ్ళు మీరు దాగడంలేదా. మా రగతం ఎర్రగాను. మీ రగతం నల్లగాను వుంటదా?" అన్నాడు.

"మరిగయితే మీ బామ్మలు మావోళ్ళని మీ వాడకట్టలోకి అడుగు బెట్టనియ్యరుగా సామీ?"

అయనగోరు పకపకానగిండు. "అదంతేరా. అయ్యన్ని పైపైఏసాలు. మా బామ్మలుచేసే ఈపూజలు. జపాలు. తపాలు ఇయ్యన్ని వుత్త బూటకాలు. పాటు మాటుగా అళ్ళుజేసే పనులు సేస్తానే వుంటారు. మంతరాలు సదివి తద్దినాలు బెట్టే శంకర శాస్త్రికి మాదిగ బసిలికి సంబంధం లేదూ? ఇకపోతే కిష్టమూర్తి పంతులు నాటుసారా పూటుగా కొట్టడం లేదూ? మీరు జేసే శండాలపు పనులన్ని ఆళ్ళూ సేస్తానేవుంటారుగందా మరిఆళ్ళకి మీకు తేడా ఏంటంటా? మీరు సేలు దున్నుతారు. నాట్లు ఏస్తారు. పంటలు పండిచ్చి తీసుకొచ్చి మాకు పురులు గట్టిపోస్తన్నారు. మరి మీరు బోసిన గింజలకు అంటులేదా? మీరు మా గేదెల్ని కాసుకొస్తన్నారు. ఆటి పోసనంతా మీరే జేస్తన్నారు. మరా పాలు తాగడానికి అంటు లేదా? మీ రెక్కల కట్టంతో బావులు దీస్తన్నారు. సెరువులు దవ్వుతున్నారు. అటిల్లో నీళ్ళకు అంటులేదా? రామప్ప రాత్రి కార్తీకమాసంలో కాలవకు దిగవన బుడుగు బుడుగు మునిగి మంత్రాలు సదువుతుంటే ఎగవన మాదిగ పేరాయి గుడ్డలు గుంజి ఆరేసుకుంటా వుంటాడు. ఏమిలేదురా వెంకటేశూ! ఈ కులాలు ఆశారాలు అన్ని పైపై మెఱుగులు మాది గొప్పకులం, మేము బామ్మలమని బీరాలు కాపోతే ఈ సంగం వుంది శూశావూ. దీన్ని ఎదిరిచ్చి బతకడం కట్టం. అంతేగాని నా కట్టాంటి పట్టింపులేమి లేవు. సర్లె పండుకో పొద్దోయింది." అంటూ ఆవలించాడు. "ఆహా! ఏమి సత్తెం సెలవిచ్చినావు సామీ! నీబోటి గునవంతులు నూటికొక్కడుండా సాలు తండ్రీ" అంటూ నేను మణసులోనేదండాలు బెట్టుకున్నాను. ఆ మఱసటేడే నాకు లగ్గం అయింది. ఆడది కాపరానికి గూడవచ్చింది. అప్పుడా మారాజు ఒకరోజన్నాడుగందా: "ఒరేవెంకటేశూ! నీ పెళ్ళి సందర్భంగా నీకొక బగుమతి ఇయ్యాదల్చుకున్నారా" అన్నాడు. "మీ దయుంటే నాకంతేసాలు నాకు బగుమానా లేమివద్దుశే దొరా" అన్నాను.

"కాదుశేగాని ఈ కాయితంమీద ఏలిముద్రెయ్యి" అంటూ నా సేత ఏలిముద్రేయించుకున్నాడు. ఇప్పుడు మీరందరు గల్చి అమ్మమని తీర్మానం జేసిన పొలం అప్పుడు గౌర్నమెంటు పోఱంబాక ఆ మారాజే పట్టా దెప్పించిచ్చిండు. ఆ పొలం సాగులోకి దెచ్చుకోను. సొమ్ము గూడ ఆ మారాజే మదుపు పెట్టిండు. నల్లని తండ్రి. ఏ లోకానుండాడో. ఆయన బెట్టిన బిచ్చె యిది అంత దరమ తండ్రి ఇప్పించిన బూమి అమ్మాలంటే నాకు గుండెల్లో కోశబెట్టినట్టుగా వుంది. సరే కానీండి. మీ పెద్ద మదుసుల ఇట్ట ప్రెకారమే కానీండి. పొద్దోయింది. నేను బోయి పడుంటా" అంటూ వెంకటేశు ఇంట్లో కెళ్ళాడు మిగిలినవాళ్ళు గూడ ఎవరి దోవన వాళ్ళెళ్ళారు.

ముసలితనపు మసక చూపులతో పరిసరాలను దీక్షగా పరిశీలిస్తూ నడుస్తున్నాడు వెంకటేశు చాలా దూరంనుంచి నడిచేసరికి గుండెల్లో కొంచెం నొప్పిగా అనిపించింది. బొమ్మమీద చెయ్యివేసి గట్టిగా పట్టుకొని కాలవ కట్టమీద చదికిలబడ్డాడు. కాన్పులతో శుష్కించిన స్త్రీ లాగా కాలవ సన్నగా పాఱుతూంది. ఒడ్డునే కనుచూపు మేర పఱచుకున్న పచ్చటి పొలాలు. శీతాకాలం పొద్దు పడమటికి చఱచఱా జరిగిపోతూంది. దక్షిణపు దిక్కునుండి మెల్లగా వీచే గాలికి గడ్డిపూలు అలవోకగా తలూపుతున్నాయి. వెంకటేశు తను రోజూ చూసే ఈ పచ్చటి చేలు. తను రోజూ సంచరించే ఈ అందమైన పరిసరాలు వదిలి వెళ్ళాలంటే అతడికి గుండెల్లో ఏదో దిగులు ఆవహించింది. అతడి ముఖంలోని వృద్ధాప్యపు తాలూకు ముడతల్లో ఇరుక్కుని స్వేదం ముత్యాల్లాగ మెఱుస్తూంది కాసేపు విశ్రాంతి తీసుకునేసరికి నొప్పి సర్దుకున్నట్లనిపించి మరలా లేచి బయల్దేరాడు. ప్రక్కనేవున్న పంట కాలువలో ఎవరో కుర్రవాడు చేపలు పడుతున్నాడు. "ఎవర్రా



ఆ పిల్లగాడు!" అంటూ కళ్ళకు చెయ్యడ్డం పెట్టుకుని పరీక్షగా చూశాడు.

"నేనే తాతా! ఏసోబు కొడుకు ముత్తేళుని."

"ఏమన్నా మంచి సేవలు దొరిగినయ్యంటరా?"

"లేదు తాతా! అన్నీ బురదమట్టలే. పొద్దుగూకి నువ్వేమిటికి పొలం బోతన్నావు?"

"ఆ తల్లికీ నాకు ఇయ్యాలితో ఋణం తీరిందిరా. ఆకరి సూపు చూసుకుందారని ఎల్తన్నా. అదిసరేగానారే. నువ్వ పోటో యేప్పుడు నన్నుకూడ కాస్త యెంటేసు కెళ్ళు. బొత్తిగా కళ్ళు కనపడి చావడం లేదు."

"అట్టనేతాతా! బేగిరా మరి: ఎల్దారి."

"ఇప్పుడే సిటికలో వత్తాగా" అంటూ కొంచెం వడిగా అడుగులు వేశాడు.

వంట భారంనుండి విముక్తి చెందడానికి భూదేవి ఆరాటపడుతూంది. అప్పుడప్పుడే పైటికి వస్తున్న తెల్లటి వరి కంకులు పైరుగాలికి అటూ ఇటూ తలూపుతుంటే పసిపాప నవ్వులు వొలకబోసినట్లుగా వుంది. చేను చుట్టూ ముమ్మాఱు ప్రదక్షణంచేసి చేతులు జోడించి "తల్లీ! నిన్ను నన్ను ముడివేసిన బగమంతుడు ఇయ్యాలతో బందం విడిగొడ్తన్నాడు. బగమంతుడట్టా తీర్మానం సేత్తే నే నేటి సెయ్యను!" అంటూ గద్గద కంఠంతో గొణుక్కున్నాడు వెంకటేశు. అతడి కళ్ళ వెంబడి అశ్రువులు అవిరళంగా స్రవిస్తుంటే, అంతులేని వేదనతో గుండెల్లో నుండి పొగిలి పొగిలి దుఃఖం పెల్లుబుకుతుంటే గట్టుమీద కూలిపోయాడు. శూలాలతో పొడిచినట్లు గుండెల్లో అంతులేని నొప్పి. ఒక చేత్తో గుండెలమీద చెయ్యేసి ఒడిసి పట్టుకుని అట్లాగే బోర్లపడిపోయాడు. అతడి కుడిచేతి గుప్పిట మాత్రం మట్టినింపుకుని బిగుసుకుపోయింది.

గొరవన్నం పడమటి దిక్కంతా అలుముకుంటూంది. వినీలమైన ఆకాశం మీద అప్పుడప్పుడే చంద్రుడు ఉదయించడానికి ప్రయత్నిస్తున్నాడు. చంద్రుడిని ధిక్కరించి వున్న వెలుగును కాస్త హరించడానికి చీకటి దొంగలాగ మెల్లగా ముసురుకుంటూంది ఆకాశంలో తెల్లటి కొంగలు బారులుతీర్చి మనోహరంగా ఎగురుతూ గూళ్ళను చేరుకుంటున్నయ్. దక్షిణపు దిక్కునుండి ఒక చల్లటిగాలి తెమ్మెర వెంకటేశు దేహాన్ని వొరుసుకుంటూ ఉత్తరపు దిక్కుకు సాగిపోయింది. అప్పుడే వచ్చిన ముత్తేశు "ఈడ పండుకుని నిదరోతున్నా వేందిరా తాతా. సీకటడుతూంది ఇంటికెల్దాంరా!" అంటూ దగ్గరకొచ్చి ఎంత పిలిచినా పలకకపోయేసరికి. సందేహంగా ఊరివేపు రివ్వున పరుగెత్తాడు.



ఇటీవల రాజమండ్రిలో పతివాడ సుధాకర్ వర్ధంతి సందర్భంగా కళాదర్బార్ నిర్వహించిన సభలో వేదిక నలంకరించిన రాజమండ్రి మునిసిపల్ కమిషనర్, ముఖ్యఅతిథి శ్రీ జగ్గయ్య. ప్రధానవక్త రంగరాయ మెడికల్ కాలేజీ మాజీ ప్రిన్సిపాల్, ప్రొఫెసర్ శ్రీ టి. శ్రీనివాసన్, బహుమతి అందజేస్తున్న డాక్టర్ ఆలూరి విజయలక్ష్మిలను చూడవచ్చు



విజయవాడ తూర్పు రోటరీ క్లబ్ నూతన కార్యవర్గ పదవీ స్వీకార సభలో ప్రసంగిస్తున్న కృష్ణాజిల్లా కలెక్టర్ శ్రీ ఎ. వి. ఎస్. రెడ్డి. వేదికపై క్లబ్ నూతన అధ్యక్షుడు శ్రీ ఎన్. వెంకటేశ్వర్లు ('ఆంధ్రజ్యోతి' బిజినెస్ మేనేజరు) మాజీ అధ్యక్షుడు శ్రీ పి. ఎల్. ఎస్. ప్రసాద్‌లను చూడవచ్చు